ప్రజాశక్తి

సోమవారం 2 సెప్టెంబరు 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ముడమేరు వరద నీటిలో విజయవాడ సింగ్‌నగర్, జక్కంపూడి ప్రాంతాలు; మైలవరం మండలంలో కోతకు గురైన రోడ్డు

కొండపల్లి రైల్వేస్టేషన్లో వరద నీటిలో విశాఖ ఎక్స్‌ప్రెస్‌రైలు

జలదిగ్బంధం

సింగ్‌నగర్‌కు పడవలో వెళుతున్న సిఎం చంద్రబాబు; బుడమేరు వరదలో సింగ్‌నగర్‌వాసులు (కింద)

- ముంచెత్తిన బుడమేరు
- అంధకారంలో సింగ్‌నగర్
- నిండా మునిగిన పంటలు
- ఎన్‌టిటిపిఎస్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి
- ఘాట్ రోడ్లపై కొండ చరియలు
- రైల్వే ప్రయాణీకుల తరలింపు
- జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు
- పరామర్శించిన సిఎం చంద్రబాబు
- సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఎం

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాలు అతలాకుతలమయ్యాయి. విజయవాడ ప్రాంతం పూర్తి జల దిగ్బంధనంలో చిక్కుకుపోయింది. నడుం లోతు నీటిలో తేలియాడుతోంది. గత 20 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా ముంపునకు గురింది. ఆదివారం ఉదయం ఊహించనివిధంగా వచ్చిన బుడమేరు వరద ఉధృతితో ప్రజలు నీటిలో చిక్కుకుపోయారు. వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మంచినీరు, ఆహారం కోసం అలమటిస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని బుడమేరు వరద చుట్టుముట్టింది. సుమారు ఎనిమిది డివిజన్లలోని 30 వేల కుటుంబాలకు చెందిన లక్ష మందికిపైగా ప్రజలు వరదలో నీటిలో ఉండిపోయారు. సుమారు పది గ్రామాలు ముంపునకు గురయ్యాయి. నాలుగడుగుల ఎత్తులో వచ్చిన వరద నీటిలో ఇళ్లకు చిక్కుకుపోయాయి. ఆయా గ్రామాలతోపాటు నగరంలోనూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు చిమ్మచీకట్లో గడుపుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో ఆదివారం ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది వరద నీటిలో విద్యుత్ లైన్‌మెన్ గల్లంతయ్యాడు. పశ్చిమ ఇబ్రహీంపట్నంనకు చెందిన వజ్రాల కోటేశ్వరరావు జూపూడి గ్రామపంచాయతీ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ పనులు నిర్వహిస్తుండగా, ప్రమాదవశాతూ వరద నీటిలో పడి గల్లంతయ్యాడు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో ఓ యువకుడు వరద నీటిలో గల్లంతయ్యాడు. అలాగే ఓ మహిళ మృతదేహం సింగ్‌నగర్ ప్రాంతానికి కొట్టువచ్చి కారుపై ఇర్కుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలోని తీవ్ర భయాందోళనలకు గురయ్యాయి. వరద ప్రభావి ప్రాంతాల్లో కొన్ని పశువులు, కుక్కలు, కోళ్ల జాడ తెలియడంలేదు. ప్రజలు ముఖ్యంగా వృద్దులు, వికలాంగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా ఎన్‌టిటిపిఎస్‌లో ఐదు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. దుర్గగుడి, కొండపల్లి ఘాట్ రోడ్లలో కొండచరియలు విరిగిపడ్డాయి. వరద ఉధృతికి కొండపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేట్రాక్ దెబ్బతిన్నది. దీంతో రైల్వే అధికారులు హుటాహుటిన హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లను శనివారం రాత్రి ఒంటిగంట సమయంలో చెరువు మాధవరం స్టేషన్ వద్ద నిలిపివేశారు. నెమ్మదిగా రైళ్లను లూప్ లైన్ ద్వారా కొండపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం సుమారు 30 ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణీకులను విజయవాడకు తరలించారు. భారీ వర్షాలతో అన్నదాత నిండా మునిగాడు. కృష్ణాజిల్లాలో 22,471 హెక్టార్లలో పంటలు మునిగిపోయాయి.

గొల్లపూడి ప్రాంతంలో నీట మునిగిన పంటలు

ఉగ్ర కృష్ణమ్మ : రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి-విజయవాడ : కృష్ణానది వరద ఉగ్రరూపం దాల్చింది. బ్యారేజి అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజికి గంట గంటకు వరద భారీగా పెరుగుతోంది. ఆదివారం రాత్రి 10 గంటల సమయానికి బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో 9,94,976 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 9,94,476 క్యూసెక్కులుగా ఉంది. బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లను పూర్తి స్థాయిలో ఎత్తి వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 500 కూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రికి వరద ఉధృతి ఇంకా పెరిగే సూచనలున్నాయని అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయానికి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 9,79,576 క్యూసెక్కులుగా ఉంది. అంతకుముందు రాత్రి ఏడు గంటల సమయానికి 9,17,976 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం బ్యారేజి వద్ద 19.7 అడుగుల మేర నీటి మట్టం ఉంది.దీంతో బ్యారేజిపై రాకపోకలను నిలిపివేశారు.

బుడమేరు వరద నీటిలో చిక్కుకుపోయిన 108 వాహనం, సింగ్‌నగర్‌లో సహాయక చర్యల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది (కింద)

ఆహార సరఫరాలో జాప్యం వద్దు

సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరద బాధితులకు ఆహార సరఫరాలో ఎటువంటి జాప్యం ఉండరాదని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయములో రెండో సారి సింగ్‌నగర్ క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అందుతున్న ఆహారం, సహాయ చర్యలను సిఎం స్వయంగా పర్యవేక్షించారు. ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన బోట్స్‌పై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. వరద బాధితులను ఆదుకునే ఏ విషయంలోనూ జాప్యంను సహించేది లేదని సిఎం స్పష్టం చేశారు. అవసరమైతే కలెక్టర్లు జిల్లాల్లో వాహనాలు తీసుకుని బోట్స్ తరలించాలని సీఎం ఆదేశించారు. బాధితులకు ఆహారం సరఫరాలో జాప్యంపై ఉండకూడదన్నారు. పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేశినేని చిన్ని, యార్లగడ్డ వెంకట్రావుకు భోజనం తయారుచేసి తీసుకొచ్చే బాధ్యత అప్పగించారు. ఎంతమందికి అవసరమైతే అంతా ఇవ్వాలని సిఎం ఆదేశించారు. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు మంత్రులు అందరినీ విజయవాడకు రావాలని సిఎం చంద్రబాబు చెప్పారు.ఒక్కో డివిజన్‌కు మంత్రి సహా సీనియర్ అధికారికి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ రాత్రికి ఐదు లక్షల వాటర్ బాటిల్స్ వస్తాయన్న సిఎంకు అధికారులు వివరించారు.

పునరావాస కేంద్రాల్లో వెయ్యి మంది

ప్రజాశక్తి - విజయవాడ : వరద వల్ల దెబ్బతిన్న ప్రాంతాల ప్రజలకు పునరావస కేంద్రాలు పెంచి దాదాపు ఒక లక్ష మందికి ఆహారం కల్పించినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రస్తుతం పునరావస కేంద్రాలలో 1000 మందికిపైగాపైగా భోజన సదుపాయాలు, తాగునీరు, పాలు, విద్యుత్, మరుగుదొడ్లు, ఇతర అవసరమైన పదార్థాలు అందుబాటులో ఉన్నాయని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సరైన సురక్షితం భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ముంపు ప్రాంతంలో చిక్కుకున్నవారు భయభ్రాంతులకు గురికాకుండా విజయవాడ నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్0866-2424172, 0866-2427485 కు ఫోన్ ద్వారా కానీ 8181960909 కు మెసేజ్ రూపంలో కానీ వాళ్ళ సమస్యను తెలిపినచో వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

విఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ : రోడ్డుపైన ఉన్న వర్షపు నీటి నిలువలను వెంటనే తొలగించాలని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. అదనపు వాహనాలు పెంచి నిల్వ ఉన్న నీళ్లను త్వరగా తీసేయా లన్నారు. నగర పరిధిలో చేరుకున్న వర్షపు నీటి నిల్వలను సత్వరమే తీసేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ఆదివారం ఆయన నోవోటెల్, సి.వి.ఆర్ ఫ్లై ఓవర్, మదర్ తెరిసా జంక్షన్ మొగల్రాజపురం, ఫకీర్ గూడెం, తదితర ప్రాంతాలలో ఉన్న వర్షపు నీటిని పరిశీలించారు. ఎయిర్ టెక్ మిషన్స్ తో త్వరతిగతిన పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

డిఎంహెచ్ఒ జి.గీతాబాయి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : జిల్లాలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి తెలిపారు. వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వ్యాధుల భారిన పడకుండా ఉండటానికి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు . ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో విష జ్వరాల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

వర్షాకాలంలో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, అతిసార, టైఫాయిడ్ తదితర వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దోమలు, నీటి కాలుష్యం ద్వారా ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధులు తీవ్రత ఉన్న ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలు తీసుకోవడం, తాగునీటి సరఫరాలో పాటించాల్సిన జాగ్రత్తలను స్థానిక సంస్థలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం.

ప్రశ్న: డెంగీ నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో డెంగీ కేసులు కొన్ని వచ్చాయి. పగటి పూట కుట్టే దోమలు కారణంగానే ఈ వ్యాధి వస్తుంది. దోమలు, పట్టుకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరాన్ని పూర్తిగా కప్పిఉంచే దుస్తులు ధరించాలి. ఇంటిలోని నీటి నిల్వలు మీద దోమలు గుడ్డు పెట్టకుండా మూతలు వేయాలి. ఇంటి పరసరాల్లో తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు పనికిరాని ఎయిర్ కూలర్స్, కండిషనర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడం ద్వారా డెంగీని పూర్తిగా నివారిద్దాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: అతిసార నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?

ఆహారం, తాగునీటి కలుష్యం కారణంగా అతిసార ప్రభలుతుంది. వ్యాధి నివారణకు వేడి ఆహారాన్ని తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా వ్యాధి రాకుండా

ప్రశ్న: సీజనల్ వ్యాధులు, ఆరోగ్య సమస్యలకు ప్రజలకు ఎటువంటి చికిత్స అందుతోంది?

సీజనల్ వ్యాధులు పెరుగుతున్న పరిస్థితుల్లో పిహెచ్‌సిల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని సూచించాం. 50 పిహెచ్‌సిల్లో వ్యాధి గ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. పిహెచ్‌సిల్లో అవసరమైన రక్త పరీక్షలు చేస్తున్నాం. అవసరమైన మందులు అందుబాటులో ఉంటున్నాయి. పాము, కుక్క కాటుకు యాంటి స్నేక్ వీరం, రాబిస్ ఇంజక్షన్లు పిహెచ్‌సిల్లోనూ అందుబాటులో ఉంచాం.

ముంపు బాధితులకు పూర్తి భరోసా

- సహాయ చర్యలకు ప్రత్యేక అధికారుల నియామకం
- లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజల తరలింపు
- పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-విజయవాడ : వర్షం తగ్గుముఖం పట్టినా.. ముంపు ముంచెత్తడంతో యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టామని.. లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని కలెక్టర్ డా. జి.సజన తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ, బీసీ భూగర్భ, గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, శాసనసభ్యులు గద్దె రామమోహన్, బొండా ఉమామహేశ్వరరావు, కలెక్టర్ డా. జి.సజన తదితరులు సమావేశమయ్యారు. జిల్లాలో ముంపు ప్రభావం, దాన్ని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు, అక్కడ సౌకర్యాల కల్పన తదితరాలపై చర్చించారు. గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో వర్షకారణంగా తలెత్తిన ముంపు సమస్యను చక్కదిద్దేందుకు ప్రణాళికాయుతంగా తీసుకున్న చర్యలను కలెక్టర్ సజన.. గౌరవ ప్రజాప్రతినిధులకు వివరించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ప్రతిక్షణం అప్రమత్తతతో మార్గనిర్దేశనం చేస్తున్నట్లు తెలిపారు. పైనుంచి వరద ప్రవాహాన్ని అంచనాలను విశ్లేషించుకుంటూ ముంపు ప్రమాదం పొంచిఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. అక్కడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, మందులను అందించడంతో పాటు మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఇందుకోసం ప్రాంతాల వారీగా ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. బుడమేరు వాగుకు వరద పెరగడంతో ప్రభావిత ముంపుబారిన పడిన ప్రాంతాల్లోనో సహాయకచర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ళు తదితరాలను గుర్తించి, పునరావాసానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఏదైనా విజ్ఞప్తి రాగానే తక్షణం స్పందించేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

వైద్య శిబిరాలూ ఏర్పాటు

ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గుర్తించిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సజన తెలిపారు. గర్భిణీలను ఆసుపత్రులకు తరలించి.. వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు వెల్లడించారు. డ్రెయినేజీ వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. మంచి నీటి పైపులైన్లు ఎక్కడా లీకేజీలు లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్య చర్యల విషయంలోనూ ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధిమీనా, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ పాల్గొన్నారు.

వర్షాలు, వరదలకు
నిండా మునిగిన అన్నదాత

- కృష్ణాలో 22,471 హెక్టార్లలో పంటలు మునక
- కృష్ణానదికి పెరుగుతున్న వరద ఉధృతి
- వర్షం తగ్గినా ముంపు నుంచి బయటపడని పంటలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి, కృష్ణానదికి వరద ఉధృతి తోడవ్వడంతో అన్నదాతలు నిలువునా మునుగుతున్నారు. వర్షాలు దాటికి మునిగిన పంటలు కోలుకోకముందే వరద ఉధృతికి నదీ పరివాహక ప్రాంత కరకట్ట మధ్య సాగవుతున్న పంటలు మునుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 22,471 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు నీట మునిగినట్లు జిల్లా యంత్రాంగం ప్రాథమిక అంచనా. 1,33,557.8 హెక్టార్లలో వ్యవసాయ పంటలు సాగవ్వగా నాగాయలంక మినహా 24 మండలాల్లోని 274 గ్రామాల్లో 20,524 మంది రైతులకు సంబంధించి 21,577 హెక్టార్లలోని వరి, వేరుశనగ, మినుము, పత్తి తదితర పంటలు ముంపుకు గురయ్యాయి. 14 మండలాల్లో పసుపు, కంద, అరటి, బొప్పాయి, కూరగాయ తదితర ఉద్యాన పంటలు వర్షాలకు 303.28 హెక్టార్లు, నదీ పరివాహక భూముల్లోని 591.2 హెక్టార్లలో పంటలు వరదకు నీట మునిగాయి. 1,154 మంది రైతులకు సంబంధించి 894. 2 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యానవనశాఖలు ప్రాథమిక నివేదికను రూపొందించాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఆదివారం ఉదయం నుంచి తగ్గుముఖం పట్టాయి. శనివారం రాత్రి ఏడు గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా సగటున 96.1 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదవ్వగా మధ్యాహ్నం మూడు గంటలకు 10 మండలాల్లో స్వల్పంగా 15.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు కేవలం 0.6 మాత్రమే. వర్షం తీవ్రత తగ్గినా కాలువలు, డ్రయిన్లలో నీరు స్తంభించిపోవడంతో పొలాల్లోని నీరు కదలడం లేదు. మునిగిన పంటలు నీటి నుంచి బయట పడలేదు. బుడమేరు, వడ్లమన్నాడు, మంగలవానిసింకు, రత్నవానికోడు, గుండెరు, గంజికాలువ, ఐనంపూడి డ్రెయిన్లు, బీమనది, పాలకోడు, చంద్రయ్య డ్రైన్‌లు పొంగి పరివాహక ప్రాంతాల్లోని పల్లపు భూములను ముంచెత్తాయి. వేరుశనగ, మినుము, పసుపు, కంద, అరటి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో వరి పంటకు పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లుతుందని, మెరక ప్రాంతాల్లో వరికి ముంపు పోటు తగ్గినా గణనీయంగా దిగుబడులు తగ్గిపోతాయని రైతులు వాపోతున్నారు.

బ్యారేజి దిగువకు 9. 41 లక్షల క్యూసెక్కులు
లంక గ్రామాల ప్రజలకు పునరావాస శిబిరాలు

కృష్ణానది పరివాహక ప్రాంతంలో గంట గంటకు వరద ఉధృతి పెరిగిపోతోంది. 2009 అక్టోబర్ ఐదున అత్యధికంగా ప్రకాశం బ్యారేజి దిగువకు 10, 94, 422 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు 9 లక్షల 41 వేల 076 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీరు కరకట్టకు ఆనుకుని నిండుగా ఉధృతంగా ప్రవహి స్తోంది. పరివాహక ప్రాంతంలోని పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి తదితర మండలాల్లోని నదీ కట్టలోపల సాగవుతున్న వేలాది ఎకరాలు పంట ముంపుకు గురయింది. పెనమలూరులో పెదపులిపాక, కంకిపాడు మండలం తెన్నేరు, తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు తోడేళ్లదిబ్బ, కళింగదిబ్బ, తుమ్మలపచ్చిక, పాములంక, పిల్లివానిలంక, పొట్టిదిబ్బలంక, కనిగిరిలంక, ములకలంక, పమిడిముక్కల పశ్చిమలంకపల్లి, చల్లపల్లి మండలంలో ఆముదార్లంక, లక్ష్మీపురం, పాగోలు, మోపిదేవి మండలంలో కె కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, మోపిదేవి, నాగాయలంకలో నాగాయలంక, కోడూరు మండలంలో విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, అవనిగడ్డ మండలంలో యడ్లలంక, పులిగడ్డ, దక్షిణ చిలువోలులంక తదితర లంక గ్రామాల ప్రజలను అధికార యంత్రాంగం పునరావాస శిబిరాలకు తరలించింది.

ఎటు చూసినా వరద నీరే

- పంటపొలాలను ముంచెత్తిన వరద నీరు
- పలుచోట్ల నీటిలో నానుతున్న ఇళ్లు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- రోడ్లన్నీ జలమయం
- మచిలీపట్నం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామాల్లో ఎటు చూసినా వరద నీరే కనిపిస్తుంది. పొలాలన్నీ వరద నీటితో నిండిపోయాయి. కొన్ని గ్రామాలకు దారి సదుపాయం లేకుండా పోయింది. ముస్తాబాద్‌లో పెద్ద చెరువు కట్ట తెగిపోవడంతో నీరంతా పొలాలను ముంచేసింది. ప్రధాన రోడ్లన్నీ జలమయం అయ్యాయి. సూరంపల్లి వెళ్లే రోడ్డు పైన వరద నీరు ఉధతంగా ప్రవహిస్తుంది. ముస్తాబాద్ లో నున్న వెళ్లే రోడ్డులో ఉన్న పలు షాపులు నీట మునిగాయి. లంబాడివాగు ప్రమాదకరంగా మారింది. వరిపొలాలతో పాటు మినుము పొలాలు నీట మునిగిపోవడంతో తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 1500 ఎకరాల్లో పంట నీట మునిగింది. సుందరయ్య నగర్ కాలనీ, విఎస్ పురంలో ఇళ్లు నీటిలో నానుతున్నాయి. గన్నవరం ఎస్టి కాలనీ లోను అదే పరిస్థితి కొనసాగుతోంది. చీమల వాగు పొంగి రమణమ్మ చెరువు కాలనీ, రాజీవ్ కాలనీ లో వర్షం నీరు వెళుతుంది. పురుషోత్తపట్నం చెరువు పొంగి వరి చేలు మునిగి పోయాయి. సూరంపల్లి, ముస్తాబాద, బీబీ గూడెం, గొల్లనపల్లి, కొండపావులూరు గ్రామాల్లోని చెరువులన్నీ వరద నీటితో నిండి ప్రమాదకర స్థాయికి చేరాయి. కట్టలు తెగిపోతాయని రైతులు భయపడుతున్నారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. గన్నవరం మండలంలో మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు చెరువులు పొంగి వందలాది ఎకరాలను ముంచేశాయని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు తెలిపారు.

కోసుకుపోయిన తారు రోడ్డు

గన్నవరం మండలం కొండపావులూరు శివారు ఏరియాలో ఉన్న ఎన్టీఆర్ ఎఫ్ కు వెళ్లి తారు రోడ్డు కోతకు గురైంది. మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి మీరు ఉదతంగా రావడంతో రోడ్డు కోసుకుపోయింది. 20 అడుగుల వేల అడుగుతున్నా రోడ్డు కోతకు గురవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎన్టీఆర్ ఎఫ్ వాహనాలు వెళ్ళేందుకు వీలు లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గుడివాడ ఆర్డీవో పద్మావతి, గన్నవరం తాహసిల్దార్ శివయ్య, సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అలాగే బుడమేరు వరద వల్ల ముంపుకు గురైన నాలుగు కుటుంబాలను సావరగూడెం ఎంపీపీ స్కూల్లోకి తరలించారు. ఆ గ్రామ సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. వరద తగ్గేవరకు వారిని అక్కడే ఉంచాలని అధికారులు సూచించారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవి మండలం కే.కొత్తపాలెం గ్రామంలో ప్రజలను వరద బారి నుంచి కాపాడేందుకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, తహసిల్దార్ మేడపాటి శ్రీవిద్య, ఎస్ఐ సత్యనారాయణ తదితర అధికారులు పరిశీలించారు. ఆదివారం ఉదయాన్నే గ్రామంలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

ప్రజాశక్తి పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని ముదునూరు రోడ్‌లో ఉన్న పంచాయతీ చెరువు కు గండిపడి చెరువు గట్టు మీద నివాసం ఉంటున్న ఇళ్లల్లోకి నీళ్లు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో నుండి బయటకు రాలేని పరిస్థితి ఉందని, కనీసం అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గాని తమ గోడు పట్టించుకోవడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వింజరం పాడు మోపర్రు గ్రామాలలో ఒన్నేరు డ్రైను ఉధతంగా ప్రవహించడంతో పంట పొలాలన్నీ నీట మునిగాయి. **ప్రజాశక్తి- కోడూరు :** కోడూరు మండలంలో అధిక వర్షాల కారణంగా ముంపుకు గురైన పంట పొలాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అల్లుడు, నియోజకవర్గ జనసేన నాయకులు శీలం అశ్విని కుమార్ స్థానిక జనసేన, టిడిపి శ్రేణులతో కలిపి పరిశీలించారు. ఆదివారం కోడూరు మండల పరిధిలోని ద్వారక, ఇరాలి, జరుగువానిపాలెం, పాతిరెడ్డిపాలెం, మందపాకల గ్రామాలలో పర్యటించి ముంపుకు గల కారణాలను రైతులని అడిగి తెలుసుకున్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పెదపులిపాక, యనమల కుదురు నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న కాలనీలను పోలీసులు ఖాళీ చేయిస్తున్నారు. పెదపులిపాకలో నీట మునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పరిశీలించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** భారీ వర్షాలకు మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ఇందిరా కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండిపోయి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావు ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేసి మురుగునీటి తొలగించే ఏర్పాటు ఆదివారం నిర్వహించారు. జేమ్స్ పేట, ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలం ప్రాంతాల్లో నిల్వ ఉన్న మురికి నీటిని పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించు బ్లీచింగ్ చెల్లే చర్యలు చేస్తున్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండలంలో వరద ఉధతి కొనసాగుతోంది. ఉంగుటూరు, తేలప్రోలు రహదారి వరద నీటితో మునగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఉంగుటూరు, లంకపల్లి మధ్య బుడమేరు వంతెన పై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యగా అధికారులు రోడ్డు బ్లాక్ చేశారు. పొనుకుమాడు, ఆనందపురం గ్రామాలలో చెరువును తలపించేలా పొలాలు మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొయ్యగూరపాడు, గారపాడు, ఎలుకఫాడు గ్రామాలతో పాటు జగనన్న కాలనీలో వరదనీరు చేరడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. **ప్రజాశక్తి.చల్లపల్లి :** మండల పరిధిలోని వెలివోలు, నిమ్మగడ్డ, నడకుదురు గ్రామాల్లోని పసుపు కంద అరటి పంటలకు, మలబరి తోటలకు పంటలకు తీవ్ర నష్టం జరిగింది. పట్టుపురుగుల పెంపకం రైతులకు మలబరీ తోటలతో పాటు, పట్టుపురుగుల పెంపకం షెడ్లు లలో కి వరద నీరు రావడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. **ప్రజాశక్తి- ఉయ్యూరు :** రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉయ్యూరు మండల పరిధి పలు గ్రామా ల్లో వరి పొలాలు ముంపుకు గురై చెరువులను తలపిస్తున్నాయి. ఎగువనుంచి వచ్చిన నీటితో కడవకొల్లు-పొట్లపాడు పరిధిలో వరి పొలాలు మునిగిపోయాయి. చంద్రయ్యకోడు ఎగద్దటడంతో నీరు పోయే మార్గం లేక ఎగువ నుంచి వచ్చిన నీరంతా నిలిచిపోయింది. కడవకొల్లు కాలనీలో నీరు నిలిచి ఇళ్లలోకి నీరు చేరింది. పెదఓగిరాలలో చెరువు నిండి పక్కన ఉన్న కాలనీలోకి నీరు చేరడంతో అధికారులు జేసీబీతో తవ్వించి నీరు పోయేలా చర్యలు చేపట్టారు. మండల పరిధిలో ముంపుకు గురైన ప్రాతాలను తహసీల్దార్ సురేశ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మండల పరిధిలోని పలు గ్రామాలలో దెబ్బ తిన్న పంట పొలాలను జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ ఆదివారం పరిశీలించారు. జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు,తిమోతి, చౌదరి పాల్గొన్నారు. అలాగే గూడూరు మండలం లోని ముంపు బారిన పొలాలను మండల వ్యవసాయాధికారి జి వి శివప్రసాద్ పరిశీలించారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు మండలంలో కష్ణా నది పాయ ఉదతంగా ప్రవహిస్తుంది. ఎగువ నుంచి వరద నీరు భారీగా రావడంతో వరద ఉదృతి కరకట్టను తాకింది. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, కష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్.రాజు, తాసిల్దార్ కుసుమకుమారి, ఎంపీడీవో స్వర్ణలతలతో కూడిన బృందం పడవలపైన కృష్ణానది ఆవలి ఉన్న లంక గ్రామాలైన తోడేళ్లదిబ్బ లంక, పాములు లంక గ్రామాలకు వెళ్లి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి అవగాహన కల్పించారు. కష్ణానది పాయకు వచ్చిన వరద కారణంగా లంకల్లోనే పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** ప్రకాశం బ్యారేజీ నుండి తొమ్మిది లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని దిగువకు విడుదల చేయడంతో దివిసీమలోని కష్ణానది పరివాహక ప్రాంతంలోని లోతట్టు గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. ఇప్పటికే పులిగడ్డ ఆక్విటేట్ వద్ద 19 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నదీ గర్భంలోని పాత ఎడ్ల లంక గ్రామం పూర్తిగా జరదిగ్బంధంలో ఉండగా ఆ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రానికి పంపుతున్నారు. అవనిగడ్డలో ఇప్పటివరకు నాలుగు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 15 వందలకు పైగా బాధితులను కేంద్రాలకు తరలించినట్లు అధికారులు చెప్పారు. కాగా నది పరివాహక ప్రాంతంలోని మెట్ట ప్రాంతం అంతా వరద ముంపుకు గురవుతుంది. దీనివల్ల అరటి పసుపు కంద చెరకు వివిధ రకాల ఉద్యానవన పంటలు దెబ్బతింటున్నాయి

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తనయుడు నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం అవనిగడ్డ మండల పరిధిలోని పాత ఎడ్ల లంక చిరుగోలంక గ్రామాల పర్యటించి నివాసితులకు వరద పరిస్థితి వివరించారు.

వరదలతో రూపురేఖలు మారుతున్న ఎడ్ల లంక గ్రామం

తరచూ కష్ణా నదికి వరదలు రావడం వల్ల నదీ గర్భంలోని గ్రామమైన పాత ఎడ్ల లంక రూపు రేఖలు మారుతున్నాయి. గ్రామం భారీ కోతకు గురవుతుంది. గ్రామం ఎగుబాగాన ఉన్న గట్టు మట్టి దెబ్బలు కరిగి నదిలో కలిసిపోతున్నాయి. ఎప్పుడు లేని విధంగా గ్రామ స్వరూపం మారిపోయి కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు**ప్రజాశక్తి - గుడివాడ :** మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే రైతులు పంట నష్టపోతారని, తక్షణమే అధికారులు స్పందించి బుడమేరు పరిసర ప్రాంతాలలో ఉన్న రైతులను ఆదుకోవాలని వెంకట రాఘవపురం సర్పంచ్ కాకరాల సుభాస్‌చంద్రబోసు(సురేష్) అన్నారు. ఆదివారం నందివాడ మండలం పుట్టగుంట వద్ద

అవనిగడ్డ మండలంలో పర్యటిస్తున్న మండలి వెంకటరామ్

గుడివాడలో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న సర్పంచ్

బుడమేరు వంతెనపై నుండి వరద పొంగి ప్రవహిస్తుం డడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఈ ఘటన వల్ల ప్రయాణికులు, వాహనదారులు ఏలూరు, హనుమాన్ జంక్షన్ వెళ్లాలనుకునేవారు ప్రత్యా మ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కాకరాల సురేష్ బుడమేరు పరిస్థితిని పరిశీలించి, కొన్ని ప్రాంతాలలో వరినాట్లు పూర్తిగా మునిగి పోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట టిడిపి నాయకుడు సూరపనేని సురేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** అకాల వర్షాల వలన పమిడిముక్కల మండలంలో మూడు వేల ఎకరాల పైగా వరి పంట నీట మునిగిందని మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి తెలిపారు.ఆదివారం ఆయన మండలంలోని వేల్పూరు, ముళ్లపూడి, అయినంపూడి గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. అలాగే భారీ వర్షాలకు వేల్పూరు కనుమూరు మధ్య ఉన్న వంతెన కుప్పకూలిపోయింది. కృష్ణా నది వరద బాధితులకు లంకపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పునరావసం కల్పిస్తున్నామని తాసిల్దార్ నవీన్ కుమార్ అన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మండలంలోని కాజ, వీరాయలంక,అవిరిపూడి గ్రామాలలో సిపిఎం బందం ఆదివారం పర్యటించి నీట మునిగిన ప్రాంతాలను పరిశీలి ంచారు. రైతులతో కలిసి ఇబ్బందులను తెలుసుకున్నారు. సిపిఎం పార్టీ జిల్లా నాయకులు శీలం నారాయణరావు, మద్దుల బసవరావు, ఉప్పలపు వెంకటాద్రి, జొన్నలగడ్డ వాసు, కొనకళ్ళ రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో పంటలు నీటమునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులను దుకోవాలని రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలను పరిశీలించిన వారిలో బంటుమిల్లి నాయకులు సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శ్రీనివాసరావు, లంకదాసుల అజయ్ ఘోష్, కృత్తివెన్ను మండల నాయకులు పుప్పాల నరసింహారావు, గంటయ్య, పాశం రాము, మోహన్‌రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన మండలంలోని వడ్లమన్నాడు మురికి కాలువ, గుడ్లవల్లేరు జగనన్న కాలనీలో మునిగిన రహదారులను మండల ఇంచార్జ్ తాసిల్దార్ కనకదుర్గ ఆదివారం పరిశీలించారు. వడ్లమన్నాడు ట్రైన్ లో తోడు, గుర్రపు డెక్క పేరుకు పోయి వరద నీరు పంట పొలాల్లో వెళ్లకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు.

చల్లపల్లి మండలంలో..

మొవ్వ మండలంలో పంటలు పరిశీలిస్తున్న నాయకులు

పమిడిముక్కల మండలంలో పునరావస కేంద్రాల్లో బాధితులు

పెదపారుపూడి మండలంలో నీట మునిగిన ఇళ్లు

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
సోమవారం
2 సెప్టెంబర్ 2024

విజయవాడ సింగ్‌నగర్‌లో పర్యటిస్తోన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

విజయవాడ సింగ్‌నగర్‌లో నీట మునిగిన ఇళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్‌లో నీట మునిగిన పంటపొలాలు

విజయవాడ సింగ్‌నగర్‌లో పునరావాస కేంద్రాలకు వెళుతున్న వరద బాధితులు

విజయవాడలో నీట మునిగిన 108 వాహనం

జల దిగ్బంధం

విజయవాడ సింగ్‌నగర్‌లో చెరువును తలపిస్తోన్న రోడ్డు

విజయవాడ సింగ్‌నగర్‌లో నీట మునిగిన వాహనాలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి కృష్ణాజిల్లా జలదిగ్బంధమైంది. విజయవాడలోని సింగ్‌నగర్ వద్ద బుడమేరు కాలువ పొంగడంతో వరద నీరు ఇళ్లను చుట్టిముట్టింది. దీంతో ఆ ప్రాంతమంతా వరద నీటితో నిండిపోయి చెరువులను తలపించింది. వరద నీరు చుట్టుముట్టడంతో బాధితులు ఇళ్లపైకి ఎక్కి సాయం కోసం ఎదురుచూశారు. విజయవాడ రూరల్ మండలం పైదూరుపాడులో ఓ యువకుడు వరద నీటిలో గల్లంత య్యాడు. కృష్ణాజిల్లాలో పంట పొలాలను వరదనీరు ముంచెత్తడంతో పంటలు మునిగిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉయ్యూరు మండలంలో
నీట మునిగిన పంట పొలాలు

ఇబ్రహీంపట్నంలో నీట మునిగిన పంటపొలాలు

తోట్లవల్లూరు మండలంలో నీట మునిగిన పంటపొలాలు

అవనిగడ్డలోని అక్విడెట్ వద్ద ప్రవహిస్తోన్న వరద నీరు

బంటుమిల్లిలో నీట మునిగిన పొలాలు చూపిస్తున్న నాయకులు,రైతులు

గన్నవరం మండలంలో ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు వెళ్లే రహదారి కోసుకుపోయిన దృశ్యం

పెనుగంచిప్రోలులో రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

విజయవాడ వన్‌టౌన్‌లో వరద నీటిలో వాహనదారుల ఇబ్బందులు

తిరువూరులో రోడ్డుపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వరద నీరు

తోట్లవల్లూరు మండలంలో నీట మునిగిన అరటిపంట

పెదపారుపూడి మండలంలో నీట మునిగిన వరి పంట

ఉంగుటూరు మండలంలో చెరువులను తలపిస్తోన్న పంట పొలాలు

గన్నవరం మండలం ముస్తాబాదలో మోకాళ్లతు నీరు

పొంగుతున్న వాగులు... వంకలు

ప్రజాశక్తి-తిరువూరు: అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు ఉపొంగి ప్రవహిస్తున్నాయి. చింతలపాడు, మునకుళ్ల, లక్ష్మీపురం, మల్లెల మధ్య ఉన్న అలుగు వాగులు రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.కాకర్ల వద్ద, తిరువూరు కట్టలేరు బ్రిడ్జి దగ్గరలో జాతీయ రహదారిపై వరద ప్రహించడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కట్టలేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో తిరువూరు శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలోకి వరద నడుము లోతు ఉండటంతో యాజమాన్యం క్యాంపస్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భగత్ సింగ్ కాలనీ, తంగెళ్లబీడు కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తరలించి భోజన సదుపాయం కల్పించారు. పంట పొలాలు కూడా వరద ముంపుకు గురయ్యాయి. వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తిరువూరు పట్టణంలో నీట మునిగిన భగత్ సింగ్, తంగెళ్ల బీడు కాలనీల్లో సిపిఎం నాయకులు పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు ఎస్వీ భద్రం, పతంగి శ్రీనివాసరావు, కూరపాటి వెంకటరత్నం, సప్పిడి సురేష్, సాంబారు వెంకటేశ్వర్లు, మోటూరి చింతయ్య, ఎస్.కె జాన్‌మియా పాల్గొన్నారు.

తిరువూరు పట్టణ శివారులోని వరదముంపుకు గురైన లోతట్టు కాలనీలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రేష్మా బేగం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భగత్ సింగ్ నగర్ కాలనీ, చింతల కాలనీ, సుందరయ్య కాలనీ, రాజుపేట ఎస్సీ కాలనీలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. చిత్తడి నేల, తేమ వాతావరణం వల్ల ప్రజలు వ్యాధులు బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు.

పునరావాస కేంద్రంలో భగత్‌సింగ్ కాలనీ వాసులు

వరద బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో ముంపుకు గురైన ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, అప్పిరెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా రెడ్డిగూడెం మండల కేంద్రంలో ఎస్సీ ఏరియా, బుడగజంగాలు నివాస ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో కొన్ని గృహాలు కూలిపోయాయనీ, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయని, కొన్ని గహాల్లోకి వరదనీరు చేరడంతో సర్వం కోల్పోయారని అన్నారు. అంతర్గత డ్రైనేజీ లేకపోవడంతో నీరు ఇళ్లలోకి చేరిందని తెలిపారు. అధికారులు వెంటనే డ్రైనేజీ వ్యవస్థ బాగుచేయాలని, ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు, వరద ఇళ్లల్లో చేరి నష్టపోయిన వారికి తగిన సహాయం చేయాలని కోరారు.

పునరావాస కేంద్రాలకు బాధితులు

ప్రజాశక్తి-వీరులపాడు: మండలంలోని వెల్లంకి గ్రామంలో ఎస్సీ కాలనీలోకి నీరు ప్రవేశించడంతో సుమారు 30 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు మండల తహశీల్దార్ రాజకిషోర్ తెలిపారు. నిరాశ్రయులైన వారందరికీ అల్పాహార, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అల్లూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర నర్సరీలో వరద నీరు పోటెత్తింది. దీంతో నర్సరీలో పెంచిన మిరప మొక్కలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. సుమారు రెండు వేల మిర్చి నారు ట్రేలు, పట్టాలు, మ్యాట్‌తో సహా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిలిందని నర్సరీ యజమాని తెలిపారు.

నీట మునిగిన జాకీర్ హుస్సేన్ కళాశాల

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇబ్రహీంపట్నం రింగ్ రోడ్డు నుంచి జాకీర్ హుస్సేన్ కాలేజీకి వెళ్లే రోడ్డు ప్రసాద్ నగర్ నడుము లోతు నీళ్లతో చెరువును తలపిస్తూ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినది. వర్షపు నీటికి తోడు కొండమీద నుండి వచ్చే నీరు బయటకు వెళ్లడానికి డ్రైనేజీ లేక ఉన్న డ్రైనేజీలు పూడిపోవడం వలన ప్రక్కన ఉన్న పెట్రోల్ బంకు వారు ప్రహరీ గోడ నిర్మించడం వలన ఈ వరద నీరు బయటకి వెళ్లడానికి అవకాశం లేక కాలేజీ రోడ్డులోను మరియు జాకీర్ హుస్సేన్ కళాశాల మొత్తం జలమయమైంది.

అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఆందోళన

పెనమలూరు : తాడిగడప సెంటర్లో-2 వంతెనల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ నార్ని వెంకటరావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అన్నా క్యాంటీన్, రైతు బజార్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇవ్వగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో పెనమలూరు మండలం సిపిఎం కార్యదర్శి ఉపాడ త్రిమూర్తులు, మండల ఐద్వా మహిళా సంఘం నాయకురాలు పుసులూరు పాత్ర లక్ష్మి, సిహెచ్ భవాని, ఉప్పాడ ఈశ్వరి, విసం రవణమ్మ ముద్ర పోయిన దుర్గ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పుసులూరు సత్యనారాయణ, సిఐటియు నాయకులు దిశరి సింహాచలం, మద్దినేని సాంబశివరావు, పుసులూరి లక్ష్మీనారాయణ, డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకులు. విసం సోమశేఖర్ పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా వాయిదా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈ నెల 3వ తేదీన మంగళవారం అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించబోయే జాబ్ మేళాను వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మళ్లీ జాబ్‌మేళా నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

వరద బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరదలో చిక్కుకున్న వేలాది కుటుంబాల ప్రజలతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల ప్రజలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోటా కళ్యాణ్ పేర్కొన్నారు. బుడమేరు వరద ముంపు ప్రాంతాలయిన విజయవాడ నగరంలోని మధ్యకట్ట, ఆదర్శకాలనీ, ప్రశాంత కాలనీ, లెనిన్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాలతో పాటు విజయవాడ రూరల్ ప్రాంతంలోని నల్లకుంట, గుంటుపల్లి, రాయనపాడు తదితర ప్రాంతాల్లో వరద బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ, వారి పడుతున్న ఇబ్బందులను నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోటా కళ్యాణ్ మాట్లాడుతూ....ఇటీవల కాలంలో ఎన్నడూ లేనీ విధంగా కనీవినీ ఎరుగని రీతిలో బుడమేరు వరదలో సింగ్‌నగర్‌లోని వేలాది కుటుంబాలు చిక్కుకొని తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారన్నారు. తక్షణమే వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలుతీసుకోవాలని కోరారు. అలాగే రూరల్ ప్రాంతంలో దెబ్బతిన్న పంట పొలాలను గుర్తించి, పరిహారం ఇవ్వాలన్నారు. అనేక చెరువులకు గండ్లు పడ్డాయని వాటిని తక్షణమే పూడ్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం సోమేశ్వరరావు, నాయకులు ఎం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ తాతయ్య పర్యటన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అకాల వర్షాల కారణంగా జలమయమైన జగ్గయ్యపేట పట్టణంలోని పలు ప్రాంతాలలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని నీట మునిగిన ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు దగ్గరుండి పంపించారు. మండలంలోని షేర్‌మహమ్మద్‌పేట నుండి జగ్గయ్యపేట వెళ్లే దారిలో పెద్ద మోరి వద్ద, గండ్రాయి వెళ్లే రోడ్, జగ్గయ్యపేట నుండి ముక్త్యాల వెళ్లే రోడ్‌లో పాలేరు బిడ్జి పైనుండి నీళ్లు పారడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. జగ్గయ్యపేట మండలం గరికపాడు గ్రామం పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. రహదారి కొట్టుకుపోవడంతో బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేశారు. చిల్లకల్లు చెరువుకి గండిపడటం వల్ల వర్షపు నీరు ఊళ్లోకి రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చెరువు ప్రాంతాన్ని ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్ పరిశీలించారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో మరో పది రోజుల పాటు మంచినీటి సదుపాయం ఇవ్వలేమని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట పట్టణం మొత్తం మంచినీటి సరఫరా చేసే పంప్ హౌస్ ముంపుకు గురవడంతో అక్కడున్న ట్రాన్స్ఫార్మర్లు, పైపులైన్లు, రోడ్లు, మోటార్లు అన్ని రిపేర్ కు రావడం జరిగిందని అవన్నీ బాగు చేయడానికి కనీసం పది రోజులు సమయం పడుతుందని కనుక ఈ పది రోజులు జగ్గయ్యపేట పట్టణంలో మంచినీటి సరఫరా ఇవ్వలేమని కఠిన ఇబ్బందులు ఎదురైన ఈ పరిస్థితుల్లో ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో వరద ఉధతిని ఎదుర్కోవడానికి అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కష్ణా నదికి వరద ఉధతి పెరుగుతున్న కారణంగా కష్ణా జిల్లాలో నది వెంబడి గ్రామాల, లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలు, కష్ణానదికి వరద ఉధతి, తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాల తరలించడానికి ప్రతి లంక గ్రామానికి ఒక్కొక్క బందాన్ని, లంక గ్రామాలు ఎక్కువగా ఉన్న మండలానికి జిల్లా అధికారిని నియమించామన్నారు. లంక గ్రామాల ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అవసరమైన బోట్లు సిద్ధం చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి ఆహారం మంచినీరు అందించాలని ఆదేశించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కృష్ణాజిల్లాలో అధిక వర్షాలు, కష్ణానది వరద ఉధతి ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08672-252572. ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీదేవి, జడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, డీఎస్ఓ వి పార్వతి, సిపిఓ జి గణేష్ కష్ణ, జిల్లా పశుసంవర్ధక అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు పాఠశాలలకు సెలవు

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రేపు సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు వెల్లడించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు దీనిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం రద్దు చేసినట్లు తెలిపారు.

జాతీయరహదారిపై వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

జాతీయ రహదారిపై రాకపోకలు బంద్

ప్రజాశక్తి-నందిగామ: నందిగామను నలు వైపులా వరద నీరు ముంచెత్తింది. నందిగామ మండలంలో నల్లవాగు, కూచివాగుకు భారీ వరద నీరు చేరుతుంది. దాములూరు కూడలి వద్ద వైరా -కట్లేరుకు భారీగా వరద నీరు చేరడంతో కూడలి వైరా ఏటి నుండి దాములూరు మూడు కిలోమీటర్ల పరిధిలో దాదాపు ఏడు అడుగుల నుండి పది అడుగుల వరకు వరద నీరు పొంగి ప్రవహిస్తుంది. దాములూరు కూడలి కొనతమాత్మకూరు, సోమవరం గ్రామాల ఆయకట్టు పొలాలు నీట మునిగాయి. నందిగామ మండలం ఏటి పట్టు పలు గ్రామాలు జలదిగ్బంధంలో మునిగాయి. దాములూరు కూడలి నుండి వీరులపాడు మండల గ్రామాలతో పాటు తెలంగాణ రాష్ట్రం గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని అంబారుపేట, ఐతవరం, కేతవీరునిపాడు, రుద్రవరం, సోమవరం, కొణతమాత్మకూరు, దాములూరు, కూడలి, మాగొల్లు, పల్లగిరి పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఆర్‌డిఓ రవీంద్రరావు, తహసిల్దార్ నూతక్కి సురేష్‌బాబు, సిఐ నాయుడు వరద పరిస్థితిని సమీక్షించారు. వరదలో చిక్కుకున్న సుమారు 50 కుటుంబాల వారిని పడవల ద్వారా సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. అంబారుపేట ఐతవరం హైవేపై జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులకు సూచించారు. అంబారుపేట ఐతవరం నేషనల్ హైవే 65 పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో అక్కడి పరిస్థితిని ఎమ్మెల్యే సమీక్షించారు.

నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరద పారటంతో ఆదివారం సాయంత్రం విజయవాడ-హైదరబాద్‌కు వాహనాల రాకపోకలు నిలిచాయి. వర్షాలకు నందిగామ డివిఆర్ కాలనీ, అనాసాగరం జగన్న కాలనీ పూర్తిగా వరద నీటిలో నానుతున్నాయి. నందిగామ రైతు పేట డౌన్, కుమారస్వామి రియల్ ఎస్టేట్ నగర్, గోవర్ధన్ గార్డెన్, పాతబస్టాండ్ మార్కెట్ యార్డ్ వెనుక రియల్ ఎస్టేట్ ప్లాట్స్ పూర్తిగా నీట మునిగాయి. నందిగామ-మధిర వెళ్లే ప్రధాని రహదారి పెద్ద బ్రిడ్జి, చిన్న బ్రిడ్జి వద్ద మున్నేరు పొంగటంతో మధిర రోడ్డు పై మోకాళ్ల లోతు పైబడి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నందిగామ-మధిర వెళ్లటానికి రాకపోకలను అధికారులు నిలిపివేశారు. నల్లవాగు పొంగటంతో నందిగామ మండలం అడవిరావులపాడు, చందాపురం వద్ద రోడ్లు కోతకు గురయ్యాయి.

నీటమునిగిన గ్రామాలు

కీసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

గ్రామాల్లో నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలంలో కృష్ణా నది పరివాహక ప్రాంతాలైన మొగులూరు, చెవిటికల్లు, ఆతుకూరు, కొత్తపేట గ్రామాలను వరద నీరు చుట్టుముట్టే అవకాశం ఉన్నందున అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గనిఆతుకూరు లంక భూములను ఇప్పటికే వరద నీరు చుట్టుముట్టడంతో లంకల్లో ఉంటున్న 30 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మొగులూరు గ్రామంలోకి వరద నీరు కాలనీలలోకి ప్రవేశించింది. వైరా ఏరు, కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మున్నేరు ఉప్పొంగి పెండ్యాల కాలనీలను చుట్టుముడుతోంది. పరిటాల చెరువు గండిపడటంతో వరద నీరు కాలనీలోకి ప్రవేశించింది. దీంతో అక్కడ ఉన్న వారిని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉంచారు. భారీ వర్షాల కారణంగా 65వ నెంబర్ జాతీయ రహదారిపై అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. శనివారం రాత్రి పరిటాల చెరువుకు గండిపడి కంచికచర్ల విజయవాడ మార్గంలో వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. తాజాగా ఐతవరం వద్ద రహదారిపై వరద నీరు చేరటంతో కంచికచర్ల మీదుగా వాహనాల రాకపోకలను అధికారులు బంద్ చేశారు. దొనబండ నుండి వాహనాలను వెనకకు మళ్లిస్తున్నారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం నుండి విజయవాడ-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి.

పలు గ్రామాలకు రాకపోకలు బంద్

కంచికచర్ల చెవిటికల్లు మార్గంలో లక్ష్మయ్య వాగు ఉధృతిగా ప్రవహించడంతో పాటు కృష్ణానదికి వరద పోటెత్తిటంతో రాకపోకలకు గత రెండు రోజులుగా బంద్ అయ్యాయి. కీసర పెండ్యాల మార్గంలోనూ, కీసర గండేపల్లి మార్గంలోనూ రోడ్లపైకి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు బంద్ అయ్యాయి. మండలంలో ఏనుగడ్డ వాగు, తోలవాగు సుద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పరిటాల-గని ఆత్కూర్ మార్గంలో రోడ్డు కోతకు గురవడంతో ఈ మార్గంలో కూడా వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

పంట నష్టపరిహారాన్ని అంచనా వేయాలి

కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి-విజయవాడ : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రాష్ట్రంలోని అనేక జిల్లాలు ప్రజా జీవన అతలాకుతలంగా మారిందని, లక్షల ఎకరాల్లో పంట మునిగిపోయిందని, మరికొన్ని లక్షల ఎకరాల్లో లేతగా ఉన్న పంట కొట్టుకుపోయిందని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు తెలిపారు. ఈక్రాప్‌తో సంబంధం లేకుండా పంట నష్టపరిహారాలను అంచనా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పంటను కాపాడుకోవడానికి వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలు చేయడంతో పాటు అందుకు అవసరమైన మెటీరియల్‌ను కూడా ఉచితంగా ఇవ్వాలని కోరారు. పోలవరం కుడికాలువ అనేక చెరువులకు గండ్లు పడి విజయవాడ నగరంలోని ప్రాంతాలన్నీ పూర్తిగా నీట మునిగాయన్నారు. దీనికి కారణం పోలవరం కాలవ చెరువు గట్టు బలహీనంగా ఉండటమేనన్నారు. ఈ ప్రాంతంలోని రాజకీయ నాయకులు మట్టిని మింగేసి కట్టలను బలహీనం చేయడం వల్ల ఈ పరిస్థితికి కారణమని, వెంటనే కరకట్టలను బలపరచాలని కోరారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మొగల్రాజపురం, సున్నబట్టిల సెంటర్ వద్ద కొండచరియలు విరిగిపడిన ఘటనలో మరికొంత మంది శిథిలాల కింద చిక్కుకుని ఉన్నారు. ఆదివారం రెండో రోజు కూడా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. ఘటన ప్రదేశాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పరిశీలించి అధికారులతో మాట్లాడారు. మృతిచెందిన వారికి సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కొండ చరియలు విరిగిపడి ఐదుగురు మృతిచెందడం, పలువురు గాయపడటం బాధాకరమన్నారు. విజయవాడ నగరంలో రెండు లక్షల మందికి పైగా ప్రజలు కొండ ప్రాంతాల్లో జీవిస్తున్నారని, వర్షాకాలంలో కొండ ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని అన్నారు. నగరంలో ఈ తరహా ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వాలు నియంత్రించలేకపోతున్నాయని అన్నారు. మృతులకు ఒక్కొక్కరికి 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టి ప్రమాద తీవ్రతను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు పి.కృష్ణ, జి.క్రాంతి కుమార్, నగర కమిటీ సభ్యులు పి.మురహరి, డి.శ్రీను, స్టాలిన్, ఆంటోనీ, లాల్‌ఖాన్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-మైలవరం: జి.కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు కట్ట తెగటంతో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. హెచ్ ముత్యాలంపాడు వద్ద బుడమేరు తెగడంతో వరద ఉధతంగా ప్రవహిస్తుంది. ఈ వరద ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మైలవరం మండలంలోని చండగూడెం శివారు జంగాలపల్లికి వెళ్లే రహదారి, జి.కొండూరు మండలం గురాజుపాలెం వెళ్లే రహదారిలో ఉన్న బ్రిడ్జి వరదలకు కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. మైలవరం అనిమిరెడ్డి కాంప్లెక్స్ లోకి వరద నీరు చేరటంతో రెండు రోజులుగా ఆరు మోటర్లు సాయంతో నీటిని తొలగించారు. మినుము, పెసర పంటలు నేలకొరిగాయి. పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. పత్తి పంట కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు. ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్‌వి సుధాకర్ రావు, వంశపారంపర్య ధర్మకర్తలు ఎస్వీఎన్ నివృత్తరావు ఆధ్వర్యంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం వారు 600 మందికి భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీవో, లయన్ జాస్తి వెంకటేశ్వరరావు, చారు గండ్ల ప్రసాద్, శ్రీధర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

హెచ్ ముత్యాలంపాడు వద్ద వరద ఉధృతి

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట మండలంలోని తాతకుంట్ల, గౌరవంపాలెం, కలగర లక్ష్మీపురం గ్రామాల్లో ఉన్న కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. ఉద్యానాధికారి బి.నరేంద్ర కుమార్ తోటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు రవి,కోలేటి రంగారావు, వలి, సాంబశివరావు పాల్గొన్నారు. విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామం పలుచోట్ల వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి. గ్రామ సర్పంచ్ కారుమంచి స్వాతి దగ్గరుండి వరద నీటిని జెసిపి సహాయంతో తొలగించడం జరిగింది. ఎంపీడీవో వెంకటరమణ, తాసిల్దార్ లక్ష్మీ కళ్యాణి గ్రామంలో పర్యటించారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: భారీ వర్షాలకు ముంపునకు గురై నిరాశ్రయులు అయిన బాధితుల సహాయార్థం నల్లూరు చారిటబుల్ ట్రస్ట్(గుంటుపల్లి) అధినేత నల్లూరు సూర్యనారాయణ (సూరిబాబు) శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు రూ.50 వేలు నగదు ఆదివారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

ఇబ్రహీంపట్నంలో పోటెత్తుతున్న వరద

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, కొండపల్లి మున్సిపాలిటీలో వరద ముంచెత్తింది. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా కొండపల్లి కొండల్లో నుంచి వచ్చిన వరదనీరు ఒకవైపు, ఎన్టిటిపిఎస్ కూలింగ్ కెనాల్, బూడిద చెరువు బుడమేరు మరోవైపు పోటెత్తడంతో కొండపల్లిలోని శాంతినగర్ ఇందిరమ్మ కాలనీ ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాత్రి సమయంలో ఒక్కసారిగా పెరిగిన వరదతో స్థానికులు భయ భ్రాంతులయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు ప్రజాప్రతినిధులు వెనువెంటనే ఇందిరమ్మ కాలనీ చేరుకోవడంతో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. క్రమంగా వరద పెరుగుతుండటంతో అందుబాటులో ఉన్న ఎత్తైన ప్రదేశాలకు ప్రజలు చేరుకున్నారు. ఇబ్రహీంపట్నం కాజీమాన్యం ప్రాంతం మొత్తం పూర్తిగా నీట మునిగింది. ఇళ్లలోకి నీళ్లు చేరాయి. శనివారం రాత్రి పెరిగిన వరద నీరు క్రమంగా ఆదివారం మధ్యాహ్నానికి తగ్గింది. బుడమేరు కాల్వకు పలుచోట్ల గండి పడటంతో వరద ప్రవాహం పెరిగింది. దీంతో జలదిగ్బంధంలో కొండపల్లి శాంతినగర్ లో ఉన్న ఇందిరమ్మ కాలనీ చిక్కుకుపోయింది. సుమారు రెండు వందల కుటుంబాలు వరదలో ఉండి పోవడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి రెవిన్యూ, పోలీస్ సిబ్బంది త్వరితగతన శాంతినగర్ చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందజేయడంతో ఇందిరమ్మ కాలనీ వాసులను సురక్షిత ప్రదేశాలకు పడవల ద్వారా తరలించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో కూడా పరిస్థితిని జిల్లా కలెక్టర్ సృజన, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సమీక్షించారు. బుడమేరుకు కవులూరు కొండపల్లి మధ్య ఏడు చోట్ల గండ్లు పడినట్లు సమాచారం. కొండపల్లి శాంతి నగర్ వద్ద రహదారి తెగిపోయింది. శాంతినగర్ కవులూరు రహదారి పూర్తిగా దెబ్బతింది. బుడమేరుకు గండ్లు పడటంతో వందల ఎకరాల్లో కవులూరు, ఈలప్రోలు, రాయనపాడు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. జలదిగ్బంధంలో ఈలప్రోలు (పాతూరు) చిక్కుకుంది. ఈలప్రోలు (కొత్తూరు) - గుంటుపల్లి ప్రధాన రహదారి ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుంది. పైడూరుపాడు గ్రామంలో వరద తాకిడికి ఓ యువకుడు కొట్టుకుపోయాడు. మరోవైపు కృష్ణానది ఉరకలెత్తుతుండటంతో ఇబ్రహీంపట్నం, ఫెర్రి పరిసర ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. నీట మునిగిన కొండపల్లి శాంతినగర్ ఇందిరమ్మ కాలనీల్లో సిపిఎం నాయకులు ఆదివారం పర్యటించారు. ప్రభుత్వం తక్షణమే బాధితులను ఆదుకోవాలని, సాయం ప్రకటించాలని సిపిఎం కొండపల్లి టౌన్ కార్యదర్శి యం మహేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ కె బాషా, ప్రకాష్ రావు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రైళ్లు... ప్రయాణికుల తరలింపు

వరద ఉధృతికి కొండపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ దెబ్బ నడంతో ప్రమాదాన్ని గుర్తించిన రైల్వే అధికారులు హుటాహుటిన హైదరాబాదు నుంచి విజయవాడ వైపుగా వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లను శనివారం రాత్రి ఒంటిగంట సమయంలో చెరువు మాధవరం స్టేషన్ వద్ద ఆపివేశారు. నెమ్మదిగా రైళ్ళను లూప్ లైన్ ద్వారా కొండపల్లి రైల్వేస్టేషన్‌కి తీసుకువచ్చి నిలిపివేశారు. ఎమ్మెల్యే చొరవతో సుమారు 30 ఆర్టీసీ బస్సుల్లో విజయవాడకు ప్రయాణికులను తరలించారు. వరద నీటిలో రాయనపాడు రైల్వే స్టేషన్లో చిక్కుకుపోయిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులను రాయనపాడు వ్యాగన్ వర్క్ షాప్ కాలనీ వద్దకు తీసుకువచ్చి, అక్కడనుండి ఆర్టీసీ బస్సుల ద్వారా సుమారు 2500 మంది ప్రయాణికులను విజయవాడ చేర్చారు.

పునరావాస కేంద్రాలకు బాధితులు

వరద పరిస్థితిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వరద నీటితో ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: మండల కేంద్రంలోని మున్నేరు బ్రిడ్జి పైనుండి ఐదు అడుగుల మేర వరద నీరు భారీగా ప్రవహిస్తోంది. శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సత్రాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరద ముంపు బాధితులకు ఆహారం అందిస్తున్నారు. శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం చుట్టూ వరద ప్రవాహం భారీగా ప్రవహిస్తోంది. ఆలయ అర్చకులు పురోహితులు ఆధ్వర్యంలో వరద ప్రవాహం తగ్గాలని గంగమ్మకు పూజలు నిర్వహించారు. వరద ముంపు ప్రాంతాలను, బాధితులను తహసీల్దార్ లక్ష్మి, ఎంపిడివో సాయి హర్ష, టిడిపి అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, సర్పంచ్ వేల్పుల పద్మ కూమారి, జెడ్పీటీసీ నాగమణి సందర్శించి వారికి భరోసా కల్పించారు. రైతులు పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. మచ్చింతాల, అనిగండలపాడు, సుబ్బయి గూడెం, వెంకటపురం, శనగపాడు గ్రామాల్లోకి వరద నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఎస్ఐ అర్జున్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు వరద ప్రవాహంను పర్యవేక్షిస్తూ సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు అందిస్తూ వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు.

తిరుపతమ్మ ఆలయం వద్ద వరద

లక్ష్మి కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మొగల్‌రాజపురం సున్నపు బట్టీల సెంటర్ లో కొండచరియలు విరిగి పడిన ప్రాంతాన్ని ఎంపి కేశినేని శివనాథ్ ఆదివారం పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న సహాయ చర్యలను పర్యవేక్షించారు. అలాగే కొండచరియలు విరిగి ఇంటి మీద పడిన ఘటనలో మతి చెందిన లక్ష్మిని బౌతికాయానికి ఎంపి కేశినేని శివనాథ్, మంత్రి, ఎమ్మెల్యేతో కలిసి నివాళు లర్పించారు. లక్ష్మి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లలో ఇలాంటి తుఫాన్ ను విజయవాడ చూడలేదన్నారు. ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో జరగకుండా వుండేందుకు అన్ని చర్యలు తీసుకుంటుమన్నారు. అధికారులకు తగిన సూచనలు చేసి..ప్రజలకు అందుబాటులో వుండాలని ఆదేశించారు. సహాయ చర్యలు పూర్తి అయ్యే వరకు కనీస సౌకర్యాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రోషిణి, టిడిపి నాయకులు బొప్పన భవకుమార్, మాదిగాని గురునాథం, 5వ డివిజన్ ప్రెసిడెంట్ దేనంద్, 7వ డివిజన్ ప్రెసిడెంట్ పటమట సతీష్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, సొంగా సంజయ్ వర్మ పాల్గొన్నారు.

సిపిఎం సహాయక చర్యలు

ప్రజాశక్తి-నందిగామ: మునేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం బృందం సహాయక చర్యలు చేపట్టింది. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న బాధితులను కలిసి వారి సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.గోపాల్, వల్లూరి రవి శేఖర్, కర్రీ వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటనారాయణ, జి.గోపీనాయక్, హుస్సేన్, అనీఫ్, జంగా దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌తో టయోటా కిర్లోస్కర్ భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వినియోగదారులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించడం కోసం యూనియన బ్యాంక్ ఆఫ్ ఇండియాతో టయోటా కిర్లోస్కర్ మోటార్స్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు కిర్లోస్కర్ మోటార్స్ ప్రతినిధి జె.కుమార్ తెలిపారు. నగరంలోని కిర్లోస్కర్ మోటార్స్ డీలర్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. టయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడానికి ఆకర్షణీయమైన పరిష్కారాలను అందించడం ఈభాగస్వామ్యం ప్రదాన ఉద్దేశమని తెలిపారు. దీనిలో భాగంగా వినియోగదారులు కొనుగోలు చేసిన ఏదైనా టయోటా వాహనాల ఆన్‌రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించనున్నట్లు తెలిపారు. యూనియన్ వెహికల్ స్కీమ్ కింద సంవత్సరానికి 8.80 శాతం నుండి ప్రారంభమయ్యే వడ్డీ రేట్లతో 84 నెలల వరకు ఈఎంఐ సదుపాయాలను వినియోగించుకోవచ్చని తెలిపారు. వీటితో పాటు యూనియన్ పరివాహన్ పథకం కింద ఫైనాన్సింగ్ సదుపాయం పొందవచ్చని తెలిపారు.

శామ్‌సంగ్ టీవీ ప్లస్ ఛానల్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎలక్ట్రానిక్స్ బ్రాండ్లలో అగ్రగామిగా ఉన్న శామ్‌సంగ్ సరికొత్తగా శామ్‌సంగ్ టీవీ ప్లస్ ఛానెల్స్ పేరుతో సరికొత్త నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు శామ్‌సంగ్ రీజనల్ ఇన్‌ఛార్జి కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శామ్‌సంగ్ టీవీ ప్లస్, టీవీ టుడే నెట్‌వర్క్ మధ్య భాగస్వామ్యం కారణ:గా అత్యధిక నాణ్యత గలప్రోగ్రామింగ్‌ను అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. సరికొత్త నెట్‌వర్క్ కారణంగా ఇప్పటికే 100కుపైగా వేగవంతమైన ఛానల్స్‌ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో వినియోగదారుల అభిరుచుకులకు అనుగుణంగా నూతన సాంకేతికతను శామ్‌సంగ్ అందిస్తుందన్నారు.

బాధితులకు అండగా నిలవండి

అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడలో బుడమేరు మునక ప్రాంతంలో సహాయక చర్యలపై ఎన్‌టిఆర్ జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం సమీక్షించారు. సమీక్షకు అధికారులు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ బుడమేరు వరద బాధితుల కష్టాలు తీర్చే వరకు విశ్రమించేది లేదన్నారు. పాలు, అహారం, నీళ్ల, కొవ్వొత్తులు, టార్చ్‌లు వెంటనే అన్ని ప్రాంతాల నుంచి అధికారులు తెప్పించాలని ఆదేశించారు. లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని బయటకు తరలించేందుకు ఇతర ప్రాంతాల నుంచి అదనపు బోట్లు, ట్రాక్టర్లు తక్షణం తెప్పించాలన్నారు. సహాయక చర్యలు వేగవంతం కావాలని, అలాగే తక్షణం అందుబాటులో ఉన్న ఫ్యాక్ట్ ఫుడ్ బాధితులకు అందివ్వాలని కోరారు. విజయవాడలో ఉన్న అన్ని షాపుల నుంచి వాటర్ బాటిల్స్ తెప్పించాలన్నారు. బాధితులకు అందించే సాయంలో ప్రతి రెండు గంటలకు మార్పు కనిపించాలని కోరారు. అక్షయ పాత్ర నుంచి, సరఫరా చేయగలిగిన ఏజెన్సీల నుంచి ఆహారం తెప్పించాలన్నారు. ఖర్చు గురించి ఆలోచన చెయ్యకండని అధికారులకు స్పష్టం చేశారు. అంతకు ముందు బుడమేరు వరద పరిస్థితిని పరిశీలించిన తరువాత సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ గత పాలకుల వైఫల్యం కారణంగా బుడమేరు వరద సంభవించిందన్నారు. వరద బాధితుల ఇబ్బందులను చూసిన తరువాత చాలా బాధవేస్తుందన్నారు. ఆహారం, నీరు, ఇతర కనీస అవసరాలు అందుబాటులో లేక వేలాది కుటుంబాల ప్రజలు చాలా దీనావస్థలో ఉన్నారన్నారు. బాధితులందరికీ అన్ని విధాలుగా న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తానని చెప్పారు. బుడమేరు కట్ట తెగడంతో ఒక్క సారిగా వరద ప్రవాహం ఎక్కువైందన్నారు.

సిఎం చంద్రబాబుతో జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపి

లక్ష మందికి ఆహారం : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆదివారం బుడమేరు వరద ప్రాంతాన్ని పరిశీలించిన కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ..వరద వల్ల దెబ్బతిన్న ప్రాంతాల ప్రజలకు పునరావస కేంద్రాలు పెంచి దాదాపు ఒక లక్ష మందికి ఆహారం కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం పునరావస కేంద్రాలలో వెయ్యి మందికి పైగా భోజన సదుపాయాలు, తాగునీరు, పాలు, విద్యుత్, మరుగుదొడ్లు ఇతర అవసరమైన పదార్థాలు అందుబాటులో ఉన్నాయని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సరైన సురక్షితం భోజనాన్ని అందిస్తున్నామని అన్నారు. కేవలం పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు మాత్రమే కాకుండా ఇళ్ల దగ్గర చిక్కుకున్న వారికి కూడా భోజనాల్ని వారి ఇంటి వద్దకే పంపిస్తూ అందరికీ భోజన ఏర్పాట్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ముంపు ప్రాంతంలో చిక్కుకున్నవారు భయభ్రాంతులకు గురికాకుండా విజయవాడ నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్0866-2424172, 0866-2427485 కు ఫోన్ ద్వారా కానీ 8181960909 కు మెసేజ్ రూపంలో కానీ వాళ్ల సమస్యను తెలిపితే వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

నగర పరిధిలో చేరుకున్న వర్షపు నీటి నిల్వలను సత్వరమే తీసేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ ధ్యాన చంద్ర అన్నారు.

ఆదివారం ఉదయం తన పర్యటనలో నోవోటెల్, సి.వి.ఆర్ ఫ్లై ఓవర్, మదర్ తెరిసా జంక్షన్ మొగల్రాజపురం, ఫకీర్ గూడెం, తదితర ప్రాంతాలలో ఉన్న వర్షపు నీటిని పరిశీలించి ఎయిర్ టెక్ మిషన్స్ తో త్వరితిగతిన పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ వాహనాలే కాకుండా అదనపు వాహనాలను కూడా సేకరించి త్వరితగతిన రోడ్డు మీద నిల్వ ఉన్న వర్షపు నీటి నిలువలను పూర్తిగా తొలగించవలసిందిగా ఆదేశించారు.

రామలింగేశ్వర్ నగర్, కృష్ణలంక తదితర ప్రాంత ప్రజలను వరదల వల్ల ముంపు ఉండే అవకాశాలు ఉన్నందున వెంటనే పునరావస కేంద్రాలకు తరలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టి రిటైనింగ్ వాల్ వెంబడి ఉండే 15 నుండి 21వ డివిజన్ ప్రాంత ప్రజలకు వరదల వల్ల ప్రమాదాలకు గురగే అవకాశం ఉందని హెచ్చరించి వారిని పునరావస కేంద్రాలకు తరలించారు. దాదాపు 250 కుటుంబాలను సర్కిల్ 3 పరిధిలో ఉన్న పునరావస కేంద్రాలకు తరలించారు.

బుడమేరు వరద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: బుడమేరు వరద బాధితులను ప్రభుత్వం అదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బుడమేరు వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా బాధిత ప్రజలకు పునరావాసం కల్పించి, ప్రాణాలు కాపాడేందుకు రక్షణ కల్పించాలని కోరారు. బుడమేరు వరద ముంపుతో విజయవాడలో 30 వేల కుటుంబాలకు చెందిన లక్ష మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారని అన్నారు. బుడమేరు ఎగువన వెలగలేరు రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహం పెరుగుతుందని, గేట్లు ఎత్తివేసారని ప్రభుత్వానికి తెలిసినా, వరద ముంపుపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేయడంలో విఫలమయ్యారన్నారు. బాధితులు మంచినీరు, ఆహారం లేక అల్లాడుతున్నారన్నారు. ఇళ్లల్లో తలదాచుకుంటున్న వారికి ఆహారం, మంచినీరు, పిల్లలకు పాలు అందించాలన్నారు. విద్యుత్ పునరుద్ధరించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. వరద ముంపును దిగువకు మళ్లించడానికి తక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి : డివి కృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బుడమేరు వరద బాధిత ప్రజలను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రభుత్వ యంత్రాగాన్ని అప్రమత్తం చేయాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరదలో చిక్కుకున్న ప్రజలను రక్షించడంతో పాటు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ముంపు ప్రాంతాలన్నింటిలో ఆహారం, రక్షిత మంచినీరు, పాలు, అంటు రోగాలు ప్రభల కుండా వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గత రెండుం ోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎన్‌టిఆర్ జిల్లా అంతా అతలాకుతలం అయిపోయిందన్నారు. వాగులు పొంగి పొర్లుతున్నాయని అన్నారు. చెరువులకు గండ్లు పడి వరద నీరు ఊళ్లను ముంచెత్తుతున్నాయని అన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. బుడమేరు వరద ముంచెత్తడంతో మైలవరం నియోజకవర్గంతో పాటు విజయవాడ నగరంలోని అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయన్నారు. పునరావాస కేంద్రాలకు రాలేని ప్రజలకు, ముంపు ప్రాంతాల్లోనూ ఇళ్ల వద్దకే వెళ్లి ఆహారం, మంచినీరు, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు.

మంత్రులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ సృజన

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: వర్షం తగ్గుముఖం పట్టినా.. ముంపు ముంచెత్తడంతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టామని, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని కలెక్టర్ డా. జి.సజన తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, శాసనసభ్యులు గద్దె రామమోహన్, బొండా ఉమామహేశ్వరరావు, కలెక్టర్ డా. జి.సజన తదితరులు సమావేశమయ్యారు. జిల్లాలో ముంపు ప్రభావం, దాన్ని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు, అక్కడ సౌకర్యాల కల్పన తదితరాలపై చర్చించారు. గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో వర్షంకారణంగా తలెత్తిన ముంపు సమస్యను చక్కదిద్దేందుకు ప్రణాళికాయుతంగా తీసుకున్న చర్యలను కలెక్టర్ సజన.. గౌరవ ప్రజాప్రతినిధులకు వివరించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ప్రతిక్షణం అప్రమత్తతతో మార్గనిర్దేశనం చేస్తున్నట్లు తెలిపారు. పైనుంచి వరద ప్రవాహాన్ని అంచనాలను విశ్లేషించుకుంటూ ముంపు ప్రమాదం పొంచిఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. అక్కడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, మందులను అందించడంతో పాటు మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఇందుకోసం ప్రాంతాల వారీగా ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. బుడమేరు వాగుకు వరద పెరగడంతో ప్రభావిత ముంపుబారిన పడిన ప్రాంతాల్లోనో సహాయకచర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్ల తదితరాలను గుర్తించి, పునరావాసానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఏదైనా విజ్ఞప్తి రాగానే తక్షణం స్పందించేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గుర్తించిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సజన తెలిపారు. గర్భిణీలను ఆసుపత్రులకు తరలించి.. వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు వెల్లడించారు. డ్రెయినేజీ వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. మంచి నీటి పైపులైన్లు ఎక్కడా లీకేజీలు లేకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్య చర్యల విషయంలోనూ ప్రత్యేకంగా దష్టిసారించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధిమీనా, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.